హైదరాబాద్ । శుక్రవారం । నవంబర్ । 11 । 2016
సాక్షి

# అన్నదాతా.. సుఖీభవ





గాంధీ ఆస్పత్రిలో అన్నదానం చేస్తున్న సుఖీభవ సంస్థ నిర్వాహకులు

**ఆకలితో ఉన్నవారికి పట్టెడన్నం పెడితే వారి కడుపు నిండి.. నిండు హృదయంతో అన్నదాతా సుఖీభవ అని దీవిస్తారు. ఆ బాధ, విలువను తెలిసిన గాంధీనగర్‌కు చెందిన సుధాకర్ ఆకలితో అలమటించే పేదలకు పట్టెడన్నం పెడుతూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.**

చిక్కడపల్లి: దాదాపు దశాబ్దకాలంగా సుధాకర్ పలు సేవా కార్యక్రమాలను నిర్వహించే వారు. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలు, గాంధీ, నెహ్రూ తదితర ప్రముఖుల జయంతి రోజుల తోపాటు పలు ఆలయాల వద్ద పేదలకు అన్నదానం చేసేవారు. ఆరుగురు సభ్యులతో కలసి సుఖీభవ అనే స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఒక దేవాలయం వద్ద అన్నదానం చేస్తున్న సుధాకర్‌కు గాంధీ ఆస్పత్రిలో రోగుల బంధువుల కోసం అన్నదానం చేయాలని కొందరు సూచించారు. దీంతో ఆస్పత్రిలో ఒక రోజు అన్నదానం చేశారు. ఆకలితో అలమటిస్తున్న రోగుల బంధువుల ధీన పరిస్థితి చూసి చలించిన సుధాకర్ రోజూ అన్నదానం చేయాలని నిర్ణయించుకున్నారు. అధికారులను సంప్రదించడంతో దవాఖానా ప్రాంగణం లోని ఆశ్రమంలో రోజూ అన్నదానం చేసేందుకు అనుమతించారు. ఈ నేపథ్యంలో జూన్ 16న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్రమం తప్పకుండా రాత్రి 7 గంటల నుంచి దాదాపు 200 మందికి అన్నదానం చేస్తున్నారు.

### సొంత ఖర్చులతో...

రోజూ రెండొందల మందికి అన్నదానం కోసం రూ. 5 వేలకు పైగా ఖర్చు అవుతుంది. దాతలు ముందుకు రాకపోయినా నిత్య అన్నదానం కార్యక్రమం నిలిచిపోరానే సదుద్దేశంతో తానే సొంత నిధులతోనే సుధాకర్ అన్నదానం చేస్తున్నారు. అన్నదానం చేయడానికి ముషీరాబాద్ నియోజవర్గంలోని గాంధీనగర్‌లో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. వంటసామగ్రి, ఓ వ్యాన్ సైతం కొనుగోలు చేశారు. తను చేస్తున్న చిరు వ్యాపారంలో వచ్చే ఆదాయంలో కొంత అన్న దానం కోసం వ్యయం చేస్తూ మనసున్న మారాజయ్యారు. ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఈ బృహత్ కార్యక్రమానికి సుధాకర్ భార్య రజినీ సహకారం అనిర్వచనీయం. అన్ని విషయాల్లో ఆమె సుధాకర్‌కు చోదోడువాదోడుగా ఉంటూ భర్తకు తగిన భార్య అనిపించుకుంటున్నారు.

## దాతలు సహకరిస్తే మరింత ముందుకు...



గాంధీ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వివిధ జిల్లాల నుంచి వస్తున్న రోగులు, వారి సహాయకులంతా నిరుపేదలే. వారంతా తిండికి సైతం డబ్బుల్లేక దవాఖానా వద్ద ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి వారి కడుపు నింపడం కోసం సుఖీభవ సంస్థ చిత్తశుద్ధితో పని చేస్తోంది. దాతలు ముందుకొచ్చి సహకరిస్తే మరింత సమర్థవంతంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తాం. దాతలు, దయార్ద్ర హృదయులు చేయూతనివ్వాలని కోరుతున్నాం. వివరాలకు ఫోన్స్: 94923 85240, 92471 79343లలో సంప్రదించవచ్చు.

– బి.సుధాకరం, సుఖీభవ సంస్థ చైర్మన్